E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారిగా
విలేకరులు కావలెను వాట్సాప్ నెం:
9959812941-9949356387

PUBLISHED: HYDERABAD, JANGAON | సంపుటి :01 | సంచిక :64 | మంగళవారం 04 ఆగస్టు 2026 | ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ | పేజీలు: 04 | వెల :05/-

## రెండేళ్లలో భారీ అప్పులు



2 లో

- రూ.1.69 లక్షల కోట్లు
- పార్లమెంట్‌లో కేంద్రం వెల్లడి
- మార్కెట్ నుంచే అధిక రుణాలు
- ఎఫ్ఆర్‌బీఎం నిబంధనల ప్రస్తావన
- అప్పులు రాష్ట్ర బాధ్యతే

## ఉద్యోగ హామీలు ఎక్కడ?

- రేవంత్‌పై కేటీఆర్ విమర్శలు
- విద్యార్హతపై కేటీఆర్ సందేహం
- నిరుద్యోగులపై కాంగ్రెస్ ఫెయిల్
- యూత్ డిక్లరేషన్ అమలేదే?
- రాహుల్‌కూ కేటీఆర్ ప్రశ్నలు
- రెండు లక్షల ఉద్యోగాల డిమాండ్



**న్యూస్ డెస్క్, 03 ఆగస్టు (తెలుగు గళం):** కాంగ్రెస్ ప్రభుత్వ బాధ్యతారాహిత్యం, నెరవేర్చని హామీల వల్ల తెలంగాణలో నిరుద్యోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీలపై విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో 'యూత్ డిక్లరేషన్' పేరిట కాంగ్రెస్ ఊదరగొట్టిందని కేటీఆర్ మండిపడ్డారు. అసెంబ్లీ సాక్షిగా జాబ్ క్యాలెండర్ విడుదల చేసి రెండేళ్లు కావస్తున్నా ఇంతవరకు ఉద్యోగాల భర్తీ చేపట్టలేదని దుయ్యబట్టారు. ఉద్యోగాలు రాకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురై ఒక యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 20 వేల పోలీసు ఉద్యోగాలు ఖాళీగా ఉంటే, కేవలం 7 వేల పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగులను మోసం చేయడమేనని స్పష్టం చేశారు.

**నోటిఫికేషన్లు అడిగితే ఎండ్రిన్ తాగమంటారా?**

"హైదరాబాద్లోని అశోక్ నగర్ నడిబొడ్డున రాహుల్ గాంధీ నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?" అని కేటీఆర్ ప్రశ్నించారు.

2 లో

## కేబినెట్ షాక్‌తో కాంగ్రెస్‌లో తిరుగుబాటు

- మంత్రి పదవి రాక ఇద్దరు ఎమ్మెల్యేల రాజీనామా
- చివరి నిమిషంలో జాబితా మారిందన్న ఆరోపణ
- విధేయతకు విలువ లేదంటూ పాటిల్ ఆవేదన
- మద్దతుదారుల నిరసనతో బెంగళూరులో ఉద్రిక్తత
- పార్టీ మారను.. ఆత్మగౌరవమే ముఖ్యమన్న ఎమ్మెల్యే
- కేబినెట్ విస్తరణతో కాంగ్రెస్‌లో అంతర్గత సంక్షోభం
- అసంతృప్త నేతలతో డీకే సర్కార్‌కు కొత్త తలనొప్పి

2 లో

## అసెంబ్లీకి కొత్త రూపు

- రెండు అంతస్తుల ప్రతిపాదన
- కొత్త చాంబర్లకు రూపకల్పన
- భవన సామర్థ్యంపై పరీక్షలు
- కానిస్టిట్యూషన్ క్లబ్ నిర్మాణం
- స్పీకర్‌కు అధికారిక నివాసం



2 లో

**న్యూస్ డెస్క్, 03 ఆగస్టు (తెలుగు గళం):** అసెంబ్లీ భవనంలో మరిన్ని వసతులు, సౌకర్యాలు కల్పించేందుకు మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తున్నారు. అసెంబ్లీ భవన విస్తరణపై మాస్టర్ ప్లాన్ తయారు చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, రాజకీయ పార్టీలకు అనువుగా నిర్మాణాన్ని చేపట్టాలని నిర్ణయించారు. కొద్ది కాలం క్రితం అసెంబ్లీ, శాసనమండలి ఒకే ప్రాంగణం నుంచి కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. దీంతో స్పీకర్, చైర్మన్, మంత్రులు, చీఫ్ విప్‌లు, విప్‌లకు చాంబర్లకు ఇబ్బందిగా మారింది. మంత్రుల చాంబర్లు ఇరుకుగా ఉన్నాయని, వీటిని మరికొంత విస్తరించాలని నిర్ణయించారు.



## కన్న కూతుళ్ల చేతిలోనే వృద్ధ దంపతులకు అన్యాయం..?

- లింగమూరి గూడెం ఘటన-ఆస్తి కోసం మాయమాటలు, రిజిస్ట్రేషన్ నిలిపిన తహసీల్దార్

**తెలుగు గళం న్యూస్ ఐనవోలు, / ఆగస్టు 03**

హన్మకొండ జిల్లా అయినవోలు మండలం లింగమూరి గూడెం గ్రామంలో చోటుచేసుకున్న భూ వివాదం కుటుంబ బంధాలు, ఆస్తి వ్యవహారాలు ఎంతటి విషాదానికి దారితీస్తాయో మరోసారి రుజువు చేసింది. జీవితాంతం కష్టపడి సంపాదించిన ఆస్తి చివరికి కన్న కూతుళ్ల చేతుల్లోనే వివాదానికి కేంద్రబిందువు కావడం స్థానికంగా చర్చనీయాంశమైంది.వృద్ధ దంపతుల ఆరోపణలు గ్రామానికి చెందిన గజ్జెల్లి సమ్మయ్య, భద్రమ్మ దంపతులకు సునీత, సుకన్య, వాణిశ్రీ, సుజాత,శ్రీలత అనే ఐదుగురు కుమార్తెలు, గజ్జెల్లి రాజు అనే కుమారుడు ఉన్నారు. 2018లో కుమారుడు రాజు అనారోగ్యంతో మరణించాడు. ఒక్కగానొక్క వారసుడు లేని పరిస్థితిని ఆసరాగా చేసుకున్న కుమార్తెలు," మేమే మిమ్మల్ని సాదుతాం"అని మాయమాటలు చెప్పి వృద్ధ దంపతులను తీసుకెళ్లారని ఆరోపిస్తున్నారు. రైతు బీమా పేరుతో 2020లో 3 ఎకరాల 15 గుంటల వ్యవసాయ భూమిలో తలా 20 గుంటల చొప్పున తమ పేర్లపై రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని వాపోతున్నారు. ఇన్నాళ్లు "కౌలుకు చేస్తున్నాం" అని నమ్మించి,ఇప్పుడు వరంగల్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారులకు తక్కువ ధరకు భూమిని విక్రయించి సుమారు 8 లక్షల రూపాయలకు అమ్మేందుకు ప్రయత్నిస్తున్నారని వృద్ధ దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ జోక్యంతో రిజిస్ట్రేషన్ నిలిపివేత

గత వారం స్లాట్ బుక్ చేసుకున్న కుమార్తెలు సోమవారం ఐనవోలు తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించేందుకు వచ్చారు. విషయం తెలుసుకున్న వృద్ధ దంపతులు వెంటనే కార్యాలయానికి చేరుకుని రిజిస్ట్రేషన్ నిలిపివేయాలని వేడుకున్నారు. వారి విన్నపాన్ని పరిగణలోకి తీసుకున్న తహసీల్దార్ విక్రమ్ కుమార్ వివాదం ఉన్న నేపథ్యంలో రిజిస్ట్రేషన్‌ను తక్షణమే నిలిపివేశారు. సీనియర్ సిటిజన్ ఆక్ట్ ప్రకారం తదుపరి విచారణ కోసం విషయాన్ని ఆర్డీఓకు పంపించారు.

## హైడ్రా తరహాలో మరో సంస్థ



- హోటళ్లపై ఇక సేఫ్ నిఘా
- ఆహారం-మందులపై ఒకే అథారిటీ
- కల్తీపై కఠిన కంట్రోల్
- ప్రజారోగ్యమే ప్రధాన లక్ష్యం
- ఫుడ్, డ్రగ్స్ విభాగాల విలీనం
- ఐజీ స్థాయి అధికారికి బాధ్యతలు
- రెగ్యులర్ తనిఖీలకు ప్రత్యేక బృందం
- కల్తీకి చెక్.. నాణ్యతకు గ్రీన్ సిగ్నల్

**న్యూస్ డెస్క్, 03 ఆగస్టు (తెలుగు గళం):** రాష్ట్రంలో హైడ్రా తరహాలో టీజీ సేఫ్ (Telangana Safety Authority of Food And Essential Drugs)పేరుతో కొత్త సంస్థ ఏర్పాటు చేసే పనిలో ప్రభుత్వం ఉంది. ఆ సంస్థ హోటల్స్, ఫుడ్ కోర్టులు, రెస్టారెంట్స్‌లో వినియోగదారులకు సరఫరా చేసే ఆహార పదార్థాలతో పాటు మెడికల్ షాపుల్లో ప్రజలకు విక్రయించే మందులను తనిఖీ చేయనున్నది. అందుకోసం ఇప్పటివరకు విడివిడిగా ఉన్న ఫుడ్ సేఫ్టీ, డ్రగ్స్ కంట్రోల్ సంస్థలను విలీనం చేయనున్నారు. అలాగే ఐజీ ర్యాంకు అధికారిని నియమించడం, కావాల్సిన ఫీల్డ్ స్టాఫ్‌ను సమకూర్చేందుకు కసరత్తు చేస్తున్నారు. సంస్థ ఏర్పాటుపై లీగల్ ప్రాబ్లమ్స్ రాకుండా ఉండేందుకు కావాల్సిన చట్ట సవరణలు చేసే పనిలో అధికారులు ఉన్నారు.


ప్రజా ఆరోగ్యంపై ఫోకస్

ఈ మధ్య వివిధ శాఖల్లోని విజిలెన్స్ విభాగాల పనితీరుపై సీఎం సమీక్ష చేసిన సమయంలో ఖరీదైన హోటల్స్, రెస్టారెంట్స్, పబ్స్‌లో అందిస్తోన్న ఆహారంపై చర్చ జరిగింది.

మిగతాది 2 లో..

## సుప్రీంకోర్టు విస్తరణకు పార్లమెంట్ ఆమోదం

- 38కి జడ్జిల బలం
- లోక్‌సభ గ్రీన్ సిగ్నల్
- కేసుల భారానికి చెక్
- ఏడేళ్ల తర్వాత విస్తరణ
- నలుగురు జడ్జిలకు దారి



**న్యూస్ డెస్క్, 03 ఆగస్టు (తెలుగు గళం):** దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో పెరుగుతున్న కేసుల భారాన్ని తగ్గించి, బాధితులకు వేగంగా న్యాయం అందించేందుకు ఉద్దేశించిన కీలక బిల్లుకు పార్లమెంట్ లోక్‌సభ ఆమోదం తెలిపింది. బిల్లుపై చర్చను కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ ఆరంభించారు.

2 లో

## 'జంతర్ మంతర్'కు గుడ్ బై

- కొత్త వేదికపై కసరత్తు
- సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు
- స్థానికుల ఇబ్బందులపై విచారణ
- కేంద్రానికి నోటీసులు జారీ
- కొత్త ధర్నా స్థలంపై చర్చ



2 లో

**న్యూస్ డెస్క్, 03 ఆగస్టు (తెలుగు గళం):** దేశ రాజధాని న్యూఢిల్లీలో ప్రధాన నిరసన వేదికగా ఉన్న జంతర్ మంతర్ వద్ద ధర్నాల వల్ల స్థానికులకు, రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. జంతర్ మంతర్‌కు బదులుగా మరొక అనువైన ప్రత్యామ్నాయ ప్రదేశాన్ని కేటాయించే అంశంపై కేంద్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు పొందాలని సొలిసిటర్ జనరల్‌ను ఆదేశించింది.

## అరెస్టులపై జగన్ ఆగ్రహం



2 లో

- రాత్రి దాడులు పోలీసు రాజ్యానికి నిదర్శనమన్న జగన్
- సాక్ష్యాల మాయం ప్రయత్నమా? అంటూ ప్రశ్న
- మాజీ నేతలపై కేసుల నమోదుపై విమర్శలు

## కేంద్ర ఉద్యోగులకు తీపికబురు




2 లో

- ప్రస్తుతం 60% డీఏ.. 63%కు పెరిగే అవకాశం
- ఏఐసీపీఐ సూచీ ఆధారంగా నిర్ణయం
- కేంద్ర కేబినెట్ ఆమోదం కోసం ఎదురుచూపులు
- ఉద్యోగులు, పెన్షనర్లకు భారీ ఊరట
- జులై విడత డీఏ పెంపుపై కీలక అప్‌డేట్
- ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్ణయం
- కోటి మందికిపైగా లబ్ధిదారులకు ప్రయోజనం

# సుప్రీంకోర్టు విస్తరణకు పార్లమెంట్ ఆమోదం

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా ప్రతిపక్ష సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కీలకమైన బిల్లుపై చర్చలో పాల్గొనాలని సభ్యులను స్పీకర్ వారిని రిక్వెస్ట్ చేయగా.. అయినా వినకపోవడంతో బిల్లుపై చర్చ లేకుండానే స్పీకర్ ఆమోదించారు. దీంతో సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తితో సహా మొత్తం న్యాయమూర్తుల సంఖ్యను 34 నుంచి 38కి పెంచే ప్రతిపాదనకు దిగువ సభ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే, గతంలో 2019లో సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను సీజేఐతో కలిపి 31 నుంచి 34కి పెంచారు. ఆ తర్వాత దాదాపు ఏడేళ్ల విరామం అనంతరం మళ్లీ జడ్జిల సంఖ్యను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

జడ్జీల సంఖ్య పెరిగింది ఇలా..

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 124(1) ప్రకారం సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను సవరించడం.. పెంచే అధికారం కేవలం పార్లమెంటుకు మాత్రమే ఉంటుంది. 1950లో రాజ్యాంగం అమలుల్లోకి వచ్చినప్పుడు సీజేఐతో సహా మొత్తం 8 మంది జడ్జిలు మాత్రమే ఉండేవారు. ఆ తర్వాత 1956లో సంఖ్య 10కి, 1960లో 13కు, 1977లో 18కి, 1986లో 26కు, 2009లో 31కి, 2019లో 34కు, 2026లో ప్రస్తుతం సీజేఐతో కలిపి 37 మంది జడ్జిలు ఉన్నారు. అయితే, సుప్రీంకోర్టులో ప్రస్తుతం వేలాది రాజ్యాంగ, సివిల్, క్రిమినల్ పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయి. రాజ్యాంగ ధర్మాసనాలు (Bench) సక్రమంగా నిర్వహించడానికీ, రోజువారీ విచారణలను వేగవంతం చేయడానికీ ఈదనంగా మరో నలుగురు న్యాయమూర్తుల నియామకం ఎంతో దోహదపడుతుందని న్యాయ నిపుణులు భావిస్తున్నారు.

# 'జంతర్ మంతర్'కు గుడ్ బై

మొదటి పేజీ తరువాయి

ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని జస్టిస్ జాయ్ మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ పిటిషన్‌పై కేంద్ర ప్రభుత్వం సహా సంబంధిత వర్గాలకు నోటీసులు జారీ చేసింది.

పిటిషనర్ ప్రధాన వాదనలు..

సతీష్ చంద్ కౌశిక్ దాఖలు చేసిన ఈ పిటిషన్‌లో ప్రస్తుతం జంతర్ మంతర్ వద్ద నిరసనలకు అవసరమైన మురుగునీటి పారుదల, ఆహారం తదితర ప్రాథమిక సౌకర్యాలు లేవని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ధర్నాలు జరగడం వల్ల స్థానిక నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అత్యవసర వైద్య సేవలు, సరుకుల సరఫరాకు ఆటంకం కలుగుతోందనీ పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. నిరసనల సమయంలో ప్రాంతంలోకి రావడం, వెళ్లడం కష్టంగా మారుతోందని తెలిపారు.

కోర్టు వ్యాఖ్యలు..

విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి స్పందిస్తూ, "రాకపోకలు, అత్యవసర వైద్య సేవల సరఫరాకు సంబంధించి పిటిషన్‌లో లేవనెత్తిన అంశాలు ముఖ్యమైనవి. దీనిపై కేంద్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన సూచనలు తీసుకోండి అని సొలిసిటర్ జనరల్‌ను ఆదేశించారు. విచారణ సమయంలో రాజకీయ నాయకులు పిలుపునిచ్చిన ర్యాలీలు, గత సంఘటనలను పిటిషనర్ తరఫు న్యాయవాది ప్రస్తావించగా, రాజకీయ నిరసనలపై స్పందించేందుకు ధర్మాసనం నిరాకరించింది. ఆయా వ్యవహారాలను ఎలా సరిదిద్దాలో శాంతిభద్రతల యంత్రాంగానికి తెలుసని వ్యాఖ్యానించింది. ఈ కేసు విచారణను సుప్రీంకోర్టు వేరుగా విచారించేందుకు జాబితా చేసింది.

# కేబినెట్ షాక్‌తో కాంగ్రెస్‌లో తిరుగుబాటు



**న్యూస్ డెస్క్, 03 ఆగష్టు (తెలుగు గళం):** కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వంలో తీవ్ర అసంతృప్తి జ్వాలలు భగ్గుమన్నాయి. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ వేళ పార్టీ అధిష్ఠానానికి ఊహించని షాక్ తగిలింది. కొత్త మంత్రుల ప్రమాణ స్వీకారానికి కొద్ది గంటల ముందు కేబినెట్‌లో చోటు దక్కలేదని తీవ్ర తీవ్ర అసంతృప్తికి గురైన ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమ శాసనసభ సభ్యత్వాలకు రాజీనామా చేశారు. ఇండి నియోజకవర్గ ఎమ్మెల్యే యశ్వంతరాయగౌడ వి. పాటిల్, సాగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే బెళూరు గోపాలకృష్ణ తమ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

క్షణాల్లో మారిన జాబితా.. అసంతృప్తిలో నేతలు

ఎమ్మెల్యే యశ్వంతరాయగౌడ పాటిల్ విధాన సౌధలో డిప్యూటీ స్పీకర్ రుద్రప్ప లమాణిని కలసి తన రాజీనామా లేఖను సమర్పించారు. పాటిల్‌కు మంత్రివర్గంలో చోటు కల్పించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆయన మద్దతుదారులు బెంగళూరులో భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. మరోవైపు సాగర్ ఎమ్మెల్యే బెళూరు గోపాలకృష్ణ కూడా అసెంబ్లీకి రాజీనామా చేయడంతో కాంగ్రెస్ నాయకత్వంపై తీవ్ర ఒత్తిడి పెరిగింది. రాజీనామా అనంతరం యశ్వంతరాయగౌడ పాటిల్ మీడియాతో మాట్లాడుతూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. "నేడు ఉదయం వరకు విడుదలైన జాబితాలో నా పేరు ఉంది, నాకు అధికారిక సమాచారం కూడా వచ్చింది. కానీ చివరి నిమిషంలో ప్రకటించిన ఆఖరి జాబితాలో నా పేరు కనిపించలేదు. పార్టీ అధిష్ఠానం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలో విఫలమైంది. విధిలేని పరిస్థితుల్లోనే రాజీనామా సమర్పించాను. కాంగ్రెస్ పార్టీలో విధేయతకు, నిజాయితీకి విలువ లేకుండా పోయింది."

పార్టీ మారట్లేదు కానీ ఆత్మగౌరవం ముఖ్యం

తాను పదవుల కోసం ఆరాటపడటం లేదని, 2023 అసెంబ్లీ ఎన్నికల కంటే ముందే తనకు మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చారని పాటిల్ గుర్తుచేశారు. "ప్రభుత్వం ఏర్పడిన సమయంలో రెండున్నరేళ్ల తర్వాత కేబినెట్‌లోకి తీసుకుంటామన్నారు, కానీ ఆ హామీని నిలబెట్టుకోలేదు. ఇప్పటివరకు 8 ఎన్నికలు ఎదుర్కొన్న పరిణతి చెందిన రాజకీయనాయకుడిని నేను. ఇది నా నియోజకవర్గ ప్రజలకు జరిగిన అవమానం. నేను పార్టీని వీడటం లేదు, కానీ రాజీనామా చేసే వాతావరణాన్ని వాళ్లే కల్పించారు" అని పేర్కొన్నారు.

కేబినెట్ విస్తరణ నేపథ్యం

డీకే శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రెండు నెలల తర్వాత ఈ కేబినెట్ విస్తరణ చేపట్టారు. కొత్తగా కేబినెట్ లోకి తీసుకున్న 20 మంది మంత్రులు బెంగళూరులోని లోక్ భవన్‌లో సాయంత్రం 5 గంటలకు ప్రమాణస్వీకారం చేశారు. ఈ విస్తరణలో స్థానం దక్కని పలువురు సీనియర్ నేతలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. కొందరు కార్పొరేషన్ చైర్మన్ పదవులకు కూడా రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలు కర్ణాటక కాంగ్రెస్ సర్కారులో అంతర్గత కలహాలను మరింత తీవ్రతరం చేశాయి.

# కేంద్ర ఉద్యోగులకు తీపికబురు




**న్యూస్ డెస్క్, 03 ఆగష్టు (తెలుగు గళం):** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ఉత్కంఠగా ఎదురుచూస్తున్న 8వ పే కమిషన్ వేతన పెంపునకు సంబంధించి కీలక అప్‌డేట్ రానే వచ్చింది. ద్రవ్యోల్బణాన్ని తట్టుకునేందుకు కేంద్రం ప్రతి ఏటా రెండుసార్లు ఉద్యోగులకు కరువు భత్యం రూపంలో వేతన పెంపును అందిస్తోంది. అందులో భాగంగా జులై విడతకు సంబంధించిన డీఏ పెంపుపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. అయతే ఈ డీఏ పెంపును కార్మిక శాఖ విడుదల చేసే ఆలిండియా కన్జ్యూమర్ ప్రైస్ ఇండెక్స్ ఫర్ ఇండస్ట్రియల్ వర్కర్స్ గణాంకాల ఆధారంగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయిస్తుంది. ఈసారి వెలువడిన వినియోగదారుల ధరల సూచీ ఆధారంగా ఉద్యోగులకు 3 శాతం డీఏ పెరిగే అవకాశం కనిపిస్తోంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు 60 శాతం డీఏను పొందుతున్నారు. ఇప్పుడు ప్రకటించబోయే 3 శాతం పెంపుతో డీఏ రేటు 60 శాతం నుంచి 63 శాతానికి చేరనుంది. కేంద్ర కేబినెట్ అధికారికంగా ఆమోదం తెలిపిన వెంటనే కొత్త వేతనాలు అమలుల్లోకి రానున్నాయి. తాజా నిర్ణయంతో దేశవ్యాప్తంగా ఉన్న కోటి మందికి పైగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరనుంది.

# ఉద్యోగ హామీలు ఎక్కడ?

మొదటి పేజీ తరువాయి

2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక కనీసం 10 వేల పోస్టులు కూడా భర్తీ చేయలేదని ఆరోపించారు. నోటిఫికేషన్లు వేయాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తుంటే.. సీఎం రేవంత్ రెడ్డి బాధ్యతారాహిత్యంగా 'ఎండ్రిన్ తాగి చావండి' అని మాట్లాడటం దారుణమన్నారు. ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లను 'క్రిమినల్ వేస్ట్' అని సంబోధించిన సీఎం రేవంత్ రెడ్డికే దేశంలో అత్యధిక క్రిమినల్ కేసులు ఉన్నాయని. ఆయనే అసలైన క్రిమినల్ వేస్ట్ అని కేటీఆర్ విమర్శించారు. ఢిల్లీలో రాజ్యాంగ ప్రతి పట్టుకుని తిరిగే రాహుల్ గాంధీకి తెలంగాణలో నిరుద్యోగులకు జరుగుతున్న అన్యాయం, సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు కనిపించడం లేదా అని నిలదీశారు. యూత్ డిక్లరేషన్‌లో ఇచ్చిన 24 హామీలలో ఒక్కటి కూడా నెరవేర్చలేదని కేటీఆర్ ధ్వజమెత్తారు.

రేవంత్ విద్యార్హతపై అనుమానాలు..

"రేవంత్ రెడ్డి అసలు ఏం చదివారో కూడా నాకు అనుమానంగానే ఉంది. ఎవరి సహాయం లేకుండా ఆయన తన ఎన్నికల అఫిడవిట్ నింపగలరా? కనీసం ఒక్క ఉద్యోగ ఇంటర్వ్యూ అయినా ఫేస్ చేశారా? అసలు విద్యార్థుల కష్టాలు, వారి శ్రమ రేవంత్ రెడ్డికి ఏం తెలుసు?" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ హయాంలో కరోనా సంక్షోభం వచ్చినా, కేంద్రం నుంచి నిధులు ఆగిపోయినా నిరుద్యోగుల కోసం 2 లక్షలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేశామని గుర్తుచేశారు. ఇప్పటికైనా కాలయాపన చేయకుండా 2 లక్షల ఉద్యోగాలను ఎప్పుడు భర్తీ చేస్తారో సీఎం రేవంత్ రెడ్డి. రాహుల్ గాంధీ వెంటనే సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# బీజేపీ నాయకత్వానికి పీకే సూచనలు



**న్యూస్ డెస్క్, 03 ఆగష్టు (తెలుగు గళం):** బంకీపూర్ ఉప ఎన్నిక ఫలితంతో బిహార్ ప్రజలు బీజేపీ కేంద్ర నాయకత్వానికి స్పష్టమైన సందేశం ఇచ్చారని జన సురాజ్ పార్టీ నేత ప్రశాంత్ కిశోర్ అన్నారు. బిహార్ ముఖ్యమంత్రిగా మంచి వ్యక్తిని ఎంపిక చేయాలని, రాష్ట్ర అభివృద్ధి, ఉపాధి కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన కోరారు. "బిహార్ ప్రజలు ఎన్డీయేకు 202 మంది ఎమ్మెల్యేలను ఇచ్చారు. ఆ బాధ్యతను నాయకత్వం సరిగ్గా వినియోగించాలి. నేర చరిత్ర ఉన్నవారికి కాకుండా, నిజాయితీగా పనిచేసే వ్యక్తికి నాయకత్వం ఇవ్వాలి" అని ప్రశాంత్ కిశోర్ వ్యాఖ్యానించారు. బిహార్‌లో విద్యా వ్యవస్థ మెరుగుపడాలని, యువతకు ఉద్యోగ అవకాశాలు పెరగాలని, ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి తగ్గాలని ఆయన అన్నారు. గుజరాత్ అభివృద్ధిపై ఎంత శ్రద్ధ చూపుతున్నారో, 13 కోట్ల జనాభా ఉన్న బిహార్‌పైనా అంతే శ్రద్ధ చూపాలని కేంద్రాన్ని కోరారు. "బిహార్ పిల్లలు రూ.10-15 వేల జీతాల కోసం కుటుంబాలను వదిలి గుజరాత్, ముంబై, ఢిల్లీ, బెంగళూరు వంటి ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి మారాలి" అని ఆయన అన్నారు. కులం, మతం, ఉచిత రేషన్ అంశాలకే పరిమితం కాకుండా విద్య, ఉపాధి, అభివృద్ధి ఆధారంగా రాజకీయాలు సాగాలని ప్రశాంత్ కిశోర్ పేర్కొన్నారు. "30 ఏళ్లుగా ఉన్న రాజకీయ కోట కేవలం 20 రోజుల్లో కదిలింది. ప్రజలు మార్పు కోరుకుంటున్నారనే సంకేతం ఇది" అని అన్నారు. బిహార్ భవిష్యత్తు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని ఆయన డిమాండ్ చేశారు.

# రెండేళ్లలో భారీ అప్పులు...రూ.1.69 లక్షల కోట్లు




**న్యూస్ డెస్క్, 03 ఆగష్టు (తెలుగు గళం):** ఆంధ్రప్రదేశ్ అప్పుల పై కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి పార్లమెంట్ లో స్పష్టత ఇచ్చారు. గత రెండేళ్ల కాలంలో (2024-25, 2025-26) ఏపీ ప్రభుత్వం మొత్తం రూ. 1,69,341 కోట్ల మేర అప్పులు చేసిందని వెల్లడించారు. ఇందులో 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ. 82,855 కోట్లు రుణాలు తీసుకోగా, 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ. 86,486 కోట్లను అప్పుగా సేకరించినట్లు ఆయన రాతపూర్వక సమాధానంలో ఆయన పేర్కొన్నారు. రాష్ట్రం చేసిన రుణాల్లో మెజారిటీ భాగం ఓపెన్ మార్కెట్ ల్యాండింగ్స్ ద్వారానే జరిగినట్లు కేంద్రమంత్రి తెలిపారు. 2024-25లో రూ. 78,205 కోట్లు, 2025-26లో రూ. 82,272 కోట్లను బహిరంగ మార్కెట్ నుంచే సేకరించారని వెల్లడించారు. వీటితో పాటు వివిధ బ్యాంకుల నుంచి రూ. 900 కోట్లతో పాటు, 2025-26లో మరో రూ. 1,633 కోట్ల మేర రుణాలను ఏపీ ప్రభుత్వం సేకరించిందని సమాధానంలో వివరించారు.

పూర్తిగా ప్రభుత్వాల బాధ్యతే..

అప్పుల సమీకరణ, ఆర్థిక లోటును అదుపులో ఉంచుకోవడం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతేనని పంకజ్ చౌదరి స్పష్టం చేసింది. ఎఫ్ఆర్‌బీఎం నిబంధనలకు అనుగుణంగానే రాష్ట్రాల రుణ పరిమితులు నిర్దేశించబడతాయని స్పష్టం చేశారు. ఆర్థిక క్రమశిక్షణ పాటించాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యసభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు కేంద్ర మంత్రి పంకజ్ చౌదరి ఈ వివరాలను వెల్లడించారు.

# అసెంబ్లీకి కొత్త రూపు



**న్యూస్ డెస్క్, 03 ఆగష్టు (తెలుగు గళం):** అసెంబ్లీ భవనంలో మరిన్ని వసతులు, సౌకర్యాలు కల్పించేందుకు మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తున్నారు. అసెంబ్లీ భవన విస్తరణపై మాస్టర్ ప్లాన్ తయారు చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, రాజకీయ పార్టీలకు అనువుగా నిర్మాణాన్ని చేపట్టాలని నిర్ణయించారు. కొద్ది కాలం క్రితం అసెంబ్లీ, శాసనమండలి ఒకే ప్రాంగణం నుంచి కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. దీంతో స్పీకర్, చైర్మన్, మంత్రులు, చీఫ్ విప్‌లు, విప్‌లకు చాంబర్లకు ఇబ్బందిగా మారింది. మంత్రుల చాంబర్లు ఇరుకుగా ఉన్నాయని, వీటిని మరికొంత విస్తరించాలని నిర్ణయించారు. దీంతో అదనపు చాంబర్లు అవసరం అవుతాయని గుర్తించారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతమున్న అసెంబ్లీ భవనం పైన రెండు ఫ్లోర్లను నిర్మించాలని ఆలోచన చేస్తున్నారు.

భవనానికి సామర్థ్య పరీక్షలు..

అయితే ఇప్పుడున్న భవన సామర్థ్యం ఎన్ని ఫ్లోర్లు వేయడానికి అనువుగా ఉందనే విషయాన్ని సాంకేతికంగా పరీక్షలు చేసి నివేదిక ఇవ్వడానికి ప్రైవేటు కన్సల్టెన్సీకి బాధ్యతలు అప్పగించారు. శాసనసభ పక్ష కార్యాలయాల భవనాలు, ప్రింటింగ్ ప్రెస్ గదుల భవనాన్ని మొత్తం తొలగించి పబ్లిక్ గార్డెన్ వైపు మరికొంత స్థలాన్ని సేకరించి భారీ భవనాన్ని నిర్మించాలని ఆలోచన చేస్తున్నారు. ఇందులో శాసనసభ పక్ష కార్యాలయాలు, విప్‌ల చాంబర్లు, అధికారులు ఉండటానికి, వేచి ఉండటానికి, డైనింగ్ హాల్స్‌కు అనువుగా విశాలమైన భవనాన్ని నిర్మించనున్నారు. ఎగ్జిక్యూటివ్, పొలిటికల్ వారికి వేరు వేరుగా ఫ్లోర్లు ఉండేలా చూస్తున్నారు. కానిస్టిట్యూషన్ క్లబ్‌తో పాటుగా అసెంబ్లీ స్పీకర్, డిప్యూటీ స్పీకర్, శాసనమండలి చైర్మన్, డిప్యూటీ చైర్మన్ నివాసగృహాలను నిర్మించాలని నిర్ణయించారు. స్పీకర్‌కు, చైర్మన్‌కు అధికారిక నివాసాలను నిర్మించడం, కానిస్టిట్యూషన్ క్లబ్‌ను అందులో నిర్మించాలని నిర్ణయించారు. విద్యార్థి, ప్రజా, కార్మిక, కర్షకులు, మహిళాలు ఇన్ని వర్గాల సమస్యలపై చర్చించేందుకు, సమావేశాలు, సదస్సులు, సెమినార్లు నిర్వహించేందుకు అనువుగా భవనాన్ని తీర్చిదిద్దనున్నారు.

# హైడ్రా తరహాలో మరో సంస్థ

మొదటి పేజీ తరువాయి



ఈ సందర్భంగా కొన్ని హోటల్స్‌లో తనిఖీలకు వెళ్లిన అధికారులకు పెద్ద ఎత్తున కుళ్లిన మటన్, చికెన్‌ను గుర్తించిన విషయం ప్రస్తావనకు వచ్చింది. అదే సమయంలో కల్తీ నూనెలు, వనస్పతి ఉపయోగిస్తున్నట్టు ఆధారాలు దొరికాయని అధికారులు వివరించారు. దీనితో రెగ్యులర్‌గా హోటల్స్, రెస్టారెంట్స్, పబ్స్, ఫుడ్ కోర్టులను తనిఖీ చేసేందుకు ప్రత్యేకంగా ఓ విభాగం అవసరమని అభిప్రాయానికి సీఎం వచ్చినట్టు తెలిసింది. 'ప్రజలకు అందించే ఆహారం, మందులపై నిరంతరం నిఘా ఉండాలి. అప్పుడు కల్తీ లేని ఆహారం, నాణ్యమైన మందులు ప్రజలకు అందుతాయి. ప్రజారోగ్యంపై పూర్తి స్థాయిలో ఫోకస్ పెట్టేందుకుగా ఓ వింగ్ ఏర్పాటు అవసరం.'అని సీఎం ఆదేశించినట్టు తెలిసింది. దీనితో ప్రస్తుతం మెడికల్ డిపార్ట్‌మెంట్‌లో విడివిడిగా ఉన్న ఫుడ్ సేఫ్టీ, డ్రగ్స్ కంట్రోల్ విభాగాలను ఒకే గొడుకు కిందికి తీసుకురావాలని నిర్ణయం జరిగినట్టు అధికారులు వివరించారు.

రెండు విభాగాల మధ్య కొరవడిన సమన్వయం: మెడికల్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తోన్న ఫుడ్ సేఫ్టీ, డ్రగ్స్ కంట్రోల్ విభాగాలు విడివిడిగా పనిచేస్తున్నాయి. కానీ రెండు సంస్థల మధ్య సమన్వయం లేదు. అలాగే రెండు సంస్థలకు ఫీల్డ్‌లో కావాల్సిన స్టాఫ్ లేదు. ఈ విషయాన్ని గుర్తించిన సీఎం రేవంత్ రెడ్డి రెండు విభాగాలను విలీనం చేసి, ఒక కొత్త పేరును సంస్థకు పెట్టాలని అదేశించినట్టు తెలిసింది. దీనితో టీజీ సేఫ్ (Telangana Safety Authority of Food And Essential Drugs) పేరును ఖరారు చేసినట్టు సమాచారం. ఒక ఐజీ ర్యాంకు అధికారికి సంస్థ బాధ్యతలు అప్పగించి, కావాల్సిన స్టాఫ్‌ను పోలీసు శాఖ నుంచి డిప్యూటేషన్ ద్వారా తీసుకోవాలని భావిస్తున్నారు. అయితే రెండు సంస్థల ఏర్పాటు సెంట్రల్ యాక్టు ప్రకారం ఏర్పాటయ్యాయి. విలీనం వల్ల న్యాయపరమైన సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు కావాల్సిన జాగ్రత్తలు తీసుకునే పనిలో అధికారులు ఉన్నారు. ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో ఈ రెండు రకాల పనులను ఒకే సంస్థ నిర్వహిస్తున్నది. అందుకోసం అక్కడి సంస్థల పనితీరు, అక్కడి చట్టాలను పరిశీలించేందుకు ఓ ప్రత్యేక టీమ్ ఆయా రాష్ట్రాల్లో పర్యటిస్తున్నది.

# కల్లూరు ఆర్ఎస్‌లో ఘనంగా ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ జన్మదిన వేడుకలు



**గార్లదిన్నె (తెలుగు గళం న్యూస్) ఆగస్టు 03**

అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గంలోని గార్లదిన్నె మండలం కల్లూరు ఆర్ఎస్ గ్రామంలో శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ జన్మదిన వేడుకలను అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు.సామల మధు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సామల మధు మాట్లాడుతూ ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు. ఆమె ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు.అనంతరం నాయకులు, కార్యకర్తలు ఒకరికి ఒకరు కేక్ తినిపించుకుని సంబరాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సామల రాజన్న, సామల రామాంజనేయులు, సామల మధు, కే. రామంజి ఆచారి, మజారి నాగేంద్ర, చిట్టి నలపరెడ్డి, కే. ఆంజనేయులు, కృష్ణమూర్తి, పెద్దన్న, తరుణ్ కుమార్ ఆచారి, బెల్లం రామంజి, అరవ పవన్, సాయి ప్రభాస్, లాడెన్ సురేష్, నాగేంద్ర, శర్మ, సీనా, యూత్ కిరణ్, రఘు, ధను, కృష్ణ, అభిషేక్ తదితరులు పాల్గొని ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.





# అరెస్టులపై జగన్ ఆగ్రహం



**న్యూస్ డెస్క్, 03 ఆగష్టు (తెలుగు గళం):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికార పార్టీ సాగిస్తున్న రాజకీయ కక్షసాధింపు చర్యలు, పోలీసుల అరాచకాలు ప్రజాస్వామ్యాన్నే హాస్యాస్పదం చేస్తున్నాయని.. అధికార పార్టీ నేతలు దాడులకు పాల్పడితే వారికి రక్షణ కల్పిస్తూ, దాడికి గురైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపైనే అక్రమ కేసులు బనాయించడం ఏ రకమైన న్యాయం? ప్రజాప్రతినిధులు బాధితులకు అండగా నిలబడితే వారిపై కూడా కేసులు పెడుతూ, ప్రశ్నించిన వారి తలుపులు అర్ధరాత్రి బద్దలుకొట్టి అరెస్టులు చేయడం పోలీసు రాజ్యానికి పరాకాష్ట అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

ఆలూరు బీసీ ఎమ్మెల్యే విరూపాక్షి ఇంటిపై అర్ధరాత్రి 2.45 గంటలకు భారీ పోలీసు బలగాలతో దాడి చేసి, తలుపులు పగలగొట్టి ఆయనను, ఆయన కుమారుడిని అరెస్టు చేసిన తీరు రాష్ట్రంలో చట్టబద్ధ పాలన లేదని స్పష్టం చేస్తోందని జగన్ పేర్కొన్నారు. బాధితుడిని పరామర్శించడానికి వెళ్లిన ఎమ్మెల్యేపై టీడీపీ శ్రేణులు రాళ్లతో దాడి చేస్తే, ఆ దాడి చేసిన వారిని వదిలేసి ఎమ్మెల్యే విరూపాక్షిపైనే హత్యాయత్నం కేసులు పెట్టడం ఘోరమని అన్నారు. ఈ అరాచకానికి సంబంధించిన దృశ్యాలు బయటకు రాకుండా ఇంట్లోని సీసీటీవీ హార్డ్‌డిస్కులను పోలీసులు తీసుకెళ్లడం సాక్ష్యాలను మాయం చేసే ప్రయత్నం కాదా? అని ప్రశ్నించారు.

ఇది ఒక్క ఆలూరుకే పరిమితం కాలేదని ఆయన గుర్తుచేశారు. శ్రీకాకుళంలో ఒక రోడ్డు ప్రమాదాన్ని హత్య కేసుగా మార్చి మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును అరెస్టు చేశారని, గుంటూరు ఈస్ట్ మాజీ ఎమ్మెల్యే షేక్ మొహ్మద్ ముస్తఫా వ్యాపార వివాదంలో ఉన్న వ్యక్తిని పోలీసులకు అప్పగిస్తే, ఆయనపైనే కిడ్నాప్ కేసు నమోదు చేశారని ఆరోపించారు. నాయకులు ప్రజల మధ్యకు వెళ్లినా, ప్రభుత్వాన్ని ప్రశ్నించినా కేసులు పెట్టడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని అన్నారు.

నేటి 'Gen-Z' తరం డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ, మంత్రి లోకేష్ రాజీనామా, విద్యాదీవెన బకాయిల విడుదల, నిరుద్యోగ భృతి గురించి నిలదీస్తుంటే... సమాధానం చెప్పలేక ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ అరెస్టుల డ్రామాలు ఆడుతోందని జగన్ విమర్శించారు. "చంద్రబాబు గారూ... అధికారం, పోలీసు బలం ఎప్పటికీ శాశ్వతం కావు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్ని అక్రమ కేసులకైనా, అరెస్టులకైనా భయపడేది లేదు. ప్రజా సమస్యలపై, ప్రభుత్వ అన్యాయాలపై మా పోరాటం తుదివరకు కొనసాగుతుంది" అని వైఎస్ జగన్ స్పష్టం చేశారు.

# తాటి, ఈత చెట్ల వనానికి ప్రతి సొసైటీకి ఐదు ఎకరాల భూమి కేటాయించాలి

## గీతా సంక్షేమానికి 67 కోట్లు వెంటనే మంజూరు చేయాలి..! గీతన్నల చైతన్య యాత్ర లో రాష్ట్ర అధ్యక్షులు ఎం.వి రమణ





**తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.**

గీతా కార్మిక సంక్షేమానికి కేటాయించిన 67 కోట్ల బడ్జెట్ ను వెంటనే విడుదల చేయాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం వి రమణ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గౌడన్న ల చైతన్య యాత్ర లో భాగంగా సోమవారం మరిపెడ మండల కేంద్రానికి చేరుకున్న యాత్రకు ప్రజాసంఘాలు స్వాగతం పలికి సంఘీభావం తెలిపారు. స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వద్ద జరిగిన సభలో రమణ మాట్లాడుతూ కల్లుగీత కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 2 నుండి 18 వరకు అమరుల యాదిలో గీతన్నల చైతన్య బస్సు యాత్ర రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నామని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల రమణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షన్ 4 వేలకు పెంచుతామని, ఎక్స్‌గ్రేషియా 10 లక్షలు ఇస్తామని అవి కూడా నెల రోజుల లోపే ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో చెప్పారు. కానీ

ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదని రమణ అన్నారు. వృత్తిలో ప్రమాదాలు జరిగిన వారికి ఇవ్వాల్సిన ఎక్స్‌గ్రేషియా 20 కోట్ల రూపాయలు అధికారంలోకి వచ్చి 30 నెలలు దాటినప్పటికీ ఇవ్వలేదని అన్నారు. 50 సంవత్సరాలు నిండిన వారికి పెన్షన్ ఇవ్వాలని జీవో ఉన్నప్పటికీ కొత్తగా ఎవరి దరఖాస్తులు స్వీకరించడం లేదని అన్నారు. మేము కొత్తగా కోరికలు ఏమి కోరడం లేదని మీరిచ్చిన వాగ్దానాలే అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ఏరియాలోని సొసైటీలను పునరుద్ధరించి వారికి సంక్షేమ పథకాలు వర్తింపచేయాలన్నారు. యాత్రలోరాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వృత్తిలో ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ప్రభుత్వం కాటమయ్య రక్షణ కవచం ఇస్తుందన్నారు. రాష్ట్రంలో సభ్యత్వం కలిగిన వాళ్లు 2 లక్షల 30 వేల మంది ఉండగా కేవలం 30 వేల మందికే ఇచ్చారని అన్నారు. వృత్తి చేసే వారందరికీ వెంటనే ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. తాటి ఈత చెట్ల పెంపకానికి ప్రతి సొసైటీకి ఐదు ఎకరాలు చొప్పున భూమి ఇవ్వాలని,

నీరా తాటి ఈత ఉత్పత్తుల పరిశ్రమలను ప్రోత్సహించాలని అన్నారు. నందనములోని నీరా ప్రాజెక్టు ను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. బడ్జెట్లో నీరాకు కేటాయించిన 25 కోట్లు, సంక్షేమాని కి కేటాయించిన 67 కోట్లు వెంటనే విడుదల చేసి ఖర్చు చేయాలన్నారు. గీత కార్మికుల సమస్యలు పరిష్కారం కై ప్రభుత్వం పై ఒత్తిడి పెంచేందుకే ఈ యాత్ర నిర్వహిస్తున్నామన్నారు.

కల్లుగీత కార్మిక సంఘంజిల్లా అధ్యక్ష కార్యదర్శులు గౌనీ వెంకన్న,యమగాని వెంకన్న బిక్కి వెంకటేశ్వర్లు.జిల్లా నాయకులు,గౌని సాంబయ్య, బుర్ర సుధాకర్, తాళ్ల పెల్లి నరసయ్య, మండల అధ్యక్షులు ఈరగాని శ్రీనివాస్ గౌడ్, మండల కార్యదర్శి మొగుళ్ళ యాకన్న, జిల్లా నాయకులు గాదగాని నాగన్న, జగదీష్, సోషల్ మీడియా ఇన్చార్జి బోడపట్ల రాజశేఖర్, సంఘీభావం తెలిపిన ప్రజాసంఘాల నాయకులు కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జిన్నా లచ్చయ్య, సిఐటియు మండల కన్వీనర్ దుండి వీరన్న, వ్యవసా కార్మిక సంఘం జిల్లా నాయకులు బాణాల రాజన్న, రైతు సంఘం నాయకులు అనంతచారి, వివిధ గ్రామాలకు చెందిన గీత కార్మికులు తదితరులు ఉన్నారు.

# రేగొండ, కొత్తపల్లిగోరి మండలాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

## :ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు





**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి ఉమ్మడి రేగొండ**

రేగొండ,కొత్తపల్లి గోరి మండలాల్లో పెండింగ్‌లో ఉన్న వివిధ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి,ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా అందించాలని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు అధికారులను ఆదేశించారు.సోమవారం కొత్తపల్లి గోరి మండల ఎంపీడీవో కార్యాలయంలో కొత్తపల్లి గోరి,రేగొండ రైతు వేదికలో రేగొండ మండలం సంక్షేమ పథకాల అమలు, గ్రామ పంచాయతీలలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ప్రత్యేక మండల స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై,ప్రతి శాఖకు సంబంధించిన పనుల పురోగతిపై అధికారులతో శాఖల వారీగా సుదీర్ఘంగా సమీక్షించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ... రెండు మండలాల్లోని ప్రతి గ్రామ పంచాయతీలో మౌలిక వసతుల కల్పనకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.గ్రామాల్లో తాగునీరు,సీసీ రోడ్లు,డ్రైనేజీ వ్యవస్థ,విద్యుత్ సమస్యల వంటి ప్రాథమిక అవసరాలను తక్షణమే గుర్తించి,వాటి పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.అభివృద్ధి పనుల్లో ఏమాత్రం నిర్లక్ష్యం వహించవద్దని,సర్పంచులు,స్థానిక ప్రజాప్రతినిధులతో అధికారులు నిరంతరం సమన్వయం చేసుకుంటూ పనులలో వేగం పెంచాలని ఆదేశించారు.ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులను సద్వినియోగం చేస్తూ గ్రామాలను అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.ఈ సమీక్షా సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) విజయలక్ష్మి,జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ గుటోజు కిష్టయ్య,ప్యాక్స్ చైర్మన్ నడిపెల్లి విజన్ రావు,కొత్తపల్లి గోరి, రేగొండ మండలాల తహసీల్దార్లు ఎన్.హేమ,శ్వేతారావు,ఎంపీడీఓ వెంకటేశ్వరరావు,ఎంపిఓ సురేష్,వివిధ శాఖల మండల స్థాయి అధికారులు,ఉమ్మడి మండలాల సర్పంచులు,గ్రామ కార్యదర్శులు,ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీజేపీ జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా ఆడెపు విక్రమ్ నియామకం

**తెలుగు గళం న్యూస్ ఐనవోలు/ఆగష్టు 03**



భారతీయ జనతా పార్టీ జిల్లా మోర్చా కమిటీల పునర్ వ్యవస్థీకరణలో భాగంగా వరంగల్ జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా వర్ధన్నపేట నియోజకవర్గం, ఐనవోలు మండలం, ఒంటిమామిడిపల్లి గ్రామానికి చెందిన ఆడెపు విక్రమ్ నియమితులయ్యారు.ఈ మేరకు జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు కూచన క్రాంతి కుమార్ ఆదేశాల మేరకు ఆయనకు నియామక పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆడెపు విక్రమ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన జిల్లా నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ క్యాబినెట్‌లో 27 మంది ఓబీసీ మంత్రులకు స్థానం కల్పించి బీజేపీ ఓబీసీ వర్గాలకు పెద్దపీట వేసిందని గుర్తు చేశారు.

తెలంగాణలో కూడా రాబోయే రోజుల్లో బీసీ ముఖ్యమంత్రిని చేయడమే బీజేపీ లక్ష్యమని, బీసీ వర్గాల అభివృద్ధికి పార్టీ కట్టుబడి ఉందని ఆయన అన్నారు.తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని పేర్కొన్నారు. బీజేపీలో సిద్ధాంతాల కోసం పనిచేసే వారికి సరైన గుర్తింపు ఉంటుందని, తనకు వచ్చిన అవకాశమే దానికి నిదర్శనమని తెలిపారు.ఈ అవకాశం కల్పించడంలో సహకరించిన వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యేలు కొండేటి శ్రీధర్,డా.టి. రాజేశ్వర్,వన్నాల శ్రీరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి బన్నా ప్రభాకర్, వర్ధన్నపేట నియోజకవర్గ కన్వీనర్ ముత్తిరెడ్డి కేశవరెడ్డి,కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు దండు కిషన్, ఐనవోలు మండల అధ్యక్షులు మాదాస్ ప్రణయ్,పంతిని సర్పంచ్ కన్నయ్యతో పాటు మండల కమిటీ సభ్యులు,సీనియర్ నాయకులకు ఆడెపు విక్రమ్ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

# రావులపల్లిలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

## గర్భిణులకు సామూహిక శ్రీమంతాలు



**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ**

తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని రావులపల్లిలోని అంగన్వాడీ కేంద్రం ఆధ్వర్యంలో గర్భిణీ మహిళలకు సామూహిక శ్రీమంతాల కార్యక్రమాన్ని అత్యంత వేడుకగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ మౌనిక, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సరోజన ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గర్భిణులకు పండ్లు,పూలు అందజేసి, వారిని ఘనంగా సత్కరించారు. అనంతరం ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సరోజన మాట్లాడుతూ... నవజాత శిశువులకు తల్లిపాలు అమృతం లాంటివని,బిడ్డ పుట్టిన మొదటి గంటలోనే ఇచ్చే ముర్రిపాలు పిల్లల్లో రోగనిరోధక శక్తిని విశేషంగా పెంచుతాయని తెలిపారు.తల్లిపాల ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని,గర్భిణులు మరియు బాలింతలు సరైన పోషకాహారం తీసుకుంటూ ఆరోగ్య సూత్రాలు పాటించాలని ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో రావులపల్లి అంగన్వాడీ టీచర్ ఏడెల్లి దేవేంద్ర,ఏఎన్ఎం యాదలక్ష్మి,అంగన్వాడీ టీచర్ ఉమామహేశ్వరి,ఆశా వర్కర్లు,గ్రామానికి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఐలాపూర్--కొండాయి మధ్య నిర్మిస్తున్న వంతెనలో నాణ్యత లోపాలపై తీవ్ర అనుమానాలు

## పగుళ్లు కనిపిస్తున్న వంతెనపై స్థానికుల్లో ఆందోళన

## నాణ్యత పరీక్షలు నిర్వహించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి -- ప్రజల డిమాండ్





**తెలుగు గళం కన్నాయిగూడెం :**

ములుగు జిల్లా, కన్నాయిగూడెం మండలం ఐలాపూర్--కొండాయి గ్రామాల మధ్య చిన్నతోగు వాగుపై నిర్మాణంలో ఉన్న వంతెన పనుల్లో తీవ్ర నాణ్యత లోపాలు ఉన్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిర్మాణం పూర్తికాకముందే వంతెనపై పలు చోట్ల పగుళ్లు కనిపించడం స్థానిక ప్రజలను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. నిర్మాణంలో తగిన ప్రమాణాలకు అనుగుణంగా కాంక్రీట్, సిమెంట్, ఇనుము వంటి నిర్మాణ సామగ్రిని వినియోగించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజల పన్నుల ద్వారా ఖర్చు చేస్తున్న కోట్ల రూపాయల ప్రజాధనంతో చేపడుతున్న పనుల్లో ఈ తరహా నిర్లక్ష్యం ఏ మాత్రం సమర్థనీయం కాదని మండిపడుతున్నారు. ఈ వంతెన భవిష్యత్తులో వందలాది మంది ప్రజల రాకపోకలకు కీలక మార్గం కానున్న నేపథ్యంలో నాసిరకం నిర్మాణం కొనసాగితే ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సంబంధిత అధికారులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని స్వతంత్ర నాణ్యత పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. పరీక్షల్లో నిర్మాణ లోపాలు, నాణ్యతా ప్రమాణాల ఉల్లంఘనలు తేలితే సంబంధిత కాంట్రాక్టర్, ఇంజినీర్లు, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే వంతెనలో ఉన్న పగుళ్లకు కారణాలు గుర్తించి, అవసరమైతే పూర్తి స్థాయిలో మరమ్మత్తులు లేదా పునర్నిర్మాణం చేపట్టి, భారత రోడ్లు మరియు వంతెనల నిర్మాణ ప్రమాణాలకు అనుగుణంగా ప్రజలకు సురక్షితంగా ఉండేలా పనులు పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల ప్రాణాల కంటే కాంట్రాక్టర్ల లాభాలు గొప్పవి కావు. నాసిరకం నిర్మాణాలకు అడ్డుకట్ట వేయడం ప్రభుత్వ బాధ్యత. ప్రజాధనంతో చేపట్టే ప్రతి అభివృద్ధి పని నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, భద్రతకు ఎలాంటి ప్రమాదం లేకుండా పూర్తి కావాలని స్థానిక ప్రజలు గట్టిగా డిమాండ్ చేశారు.

# నన్ను గెలిపించిన ప్రజలకు దాసునిగా సేవ చేస్తా: పాదిలి మారేశ్వరరావు(కాకర్లపల్లి సర్పంచ్)





సత్తుపల్లి,ఆర్ సి,ఆగస్టు03(తెలుగుగళం) న్యూస్:పరిసరాల పరిశుభ్రత,ప్రజా సంక్షేమం లక్ష్యంగా పల్లెను తీర్చి దిద్దుతానని సత్తుపల్లి మండలం కాకర్లపల్లి గ్రామ సర్పంచ్ పాదిలి మారేశ్వరరావు తెలిపారు.సోమవారం గ్రామంలో గల పిచ్చి మొక్కల నుండి దోమలు పెరుగుతున్నశీదున దోమల మందు,బ్లీచింగ్ చల్లించారు.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ నన్ను నమ్మి గెలిపించిన ప్రజలకు దాసునిగా ఉంటానని ప్రభుత్వ నిధులతో సంబంధం లేదని స్వంత ఖర్చులతో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు.దీంతో గ్రామ ప్రజలు సర్పంచ్ కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో: గ్రామ ఉప సర్పంచ్,పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

# భీమవరంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు"

## అంగన్వాడీ కేంద్రాలు పేదలకు వరం: కమల(వేంసూరు సెక్టార్ సూపర్ వైజర్)




**సత్తుపల్లి/వేంసూరు,ఆగస్టు03(తెలుగు గళం) న్యూస్:** సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలశీలో గల భీమవరం గ్రామంలో మూడు అంగన్వాడీ కేంద్రాల పరిధిలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు వేంసూరు సెక్టార్ సూపర్ వైజర్ కమల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా లబ్ధిదారులతో నిర్వహించిన సమావేశంలో కమల మాట్లాడుతూ పేదలకు అంగన్వాడీ కేంద్రాల సేవలు గొప్ప వరమని తెలిపారు.బిడ్డ జన్మించిన వెంటనే ముర్రుపాలు పట్టించాలని, 06 నెలల వరకు తల్లిపాలు పట్టించడం అవసరమని తెలిపారు.వ్యక్తిగత శుభ్రత తో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించడం ప్రస్తుత వానాకాలంలో తప్పని అవసరమని సూచించారు.డబ్బా పాలు వల్ల బిడ్డలకు అనేక అనారోగ్యాలు వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయని తల్లి పాలే శ్రేయస్కరమని బాలింతలకు తెలిపారు.అనంతరం లబ్దిదారులతో,చిన్నారులతో ప్రదర్శన చేశారు.ఈ కార్యక్రమంలో: అంగన్వాడీ టీచర్స్ బోళ్ళ రజిని,చిల్లగుండ్ల శాంత కుమారి,రాధ, హెల్పర్స్ పాల్గొన్నారు.

# అన్నారుగూడెం క్లస్టర్ కు ఏఈఓ ను నియమించరు కలక్టర్ సాబ్"

## మూడు నెలలుగా రైతులకు అందని సేవలు: ఆపతి వెంకట రామారావు(బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా నేత)



**సత్తుపల్లి/తల్లాడ, ఆగస్టు03(తెలుగు గళం) న్యూస్:** సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని తల్లాడ మండల పరిధిలోని అన్నారుగూడెం క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి(ఏఈఓ)ను నియమించి రైతులను ఆదుకోవాలని సోమవారం బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా నాయకుడు ఆపతి వెంకట రామారావు ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కు వినతిపత్రాన్ని ఇచ్చారు.మూడు నెలలుగా అక్కడ అధికారి లేకపోవడంతో సాంకేతిక సూచనలు,పంటల నమోదు, ప్రభుత్వ పథకాలు,విత్తనాలు,ఎరువులు పంపిణీ వంటి సేవలు సకాలంలో అందడం లేదని కలక్టర్ కు రైతులు ఇబ్బందులకు గురి అవుతున్నారని వివరించారు. వెంటనే క్లస్టర్ ఏఈఓ ను నియమిశీచాలని వ్యవసాయ జిల్లా అధికారికి కలక్టర్ తెలిపారని ఆపతి మీడియాకు వెల్లడించారు.



# కాకర్లపల్లి పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలని మువ్వా కు సీపీఎం వినతి"



**సత్తుపల్లి, ఆర్ సి,ఆగస్టు03(తెలుగుగళం) న్యూస్:**

సత్తుపల్లి మండలంలోని కాకర్లపల్లి గ్రామంలో ఇండ్లు,స్థలాలు లేని నిరుపేదలకు నిరుపయోగంగా ఉన్న బేతుపల్లి చెరువు నుండి వాటర్ వెల్ వరకు ఉన్న ఎన్టీఆర్ కాలువ స్థలాన్ని ఇప్పించాలని సోమవారం సీపీఎం మండల కార్యదర్శి జాజిరి జ్యోతి బృందం సత్తుపల్లి వచ్చిన రాష్ట్ర ఇరిగేషన్ శాఖ చైర్మన్ మువ్వా విజయ్ బాబు ను కలసి వినతిపత్రాన్ని ఇచ్చారు.మువ్వా స్పందిస్తూ సంబంధిత శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.మువ్వా ను కలిసిన వారిలో సీపీఎం మండల కమిటి సభ్యులు బండి యాలాద్రి తదితరులు ఉన్నారు.



# రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగుల పంపిణీ



**ఆత్మకూరు ఆగస్టు 03 (తెలుగు గళం):**

మండల పరిధిలోని ఎం.పి.పి.ఎస్. హౌస్ బుజుర్గ్ పాఠశాలలో హన్మకొండ రోటరీ క్లబ్ సౌజన్యంతో విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ముఖ్య అతిథిగా హాజరై, తన చేతుల మీదుగా విద్యార్థులకు స్కూల్ బ్యాగులను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... పాఠశాల విద్యార్థుల చదువుకు తోడ్పాటునందిస్తూ, వారికి అవసరమైన వస్తువులను ఉచితంగా అందజేయడం ప్రశంసనీయమని రోటరీ క్లబ్ ప్రతినిధులను అభినందించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో ప్రధానఉపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయురాలు అనురాధ, పాల్గొన్నారు



# పుస్తకాలకే పరిమితం కాని విద్య.. పొలంలో నాట్లు వేస్తూ వ్యవసాయ పాఠాలు చెప్పిన విజయ్ సార్!

## రైతే దేశానికి వెన్నెముక.. రైతు కష్టం తెలుసుకున్న చిన్నారులు





**తెలుగు గళం వెంకటాపురం, మరికాల కొత్తూరు:**

నేటి తరం పిల్లలకు వ్యవసాయం విలువ, రైతు శ్రమ, ప్రకృతి ప్రాముఖ్యతను ప్రత్యక్షంగా పరిచయం చేయాలనే సంకల్పంతో మరికాల కొత్తూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (ఎంపిపిఎస్) ఉపాధ్యాయులు కాపుల విజయ్ సార్ నిర్వహించిన వినూత్న కార్యక్రమం అందరి ప్రశంసలు అందుకుంది. పాఠశాల గోడల మధ్యే విద్యను పరిమితం చేయకుండా, విద్యార్థులను నేరుగా వరి పొలానికి తీసుకెళ్లి రైతులతో కలిసి వరి నాట్లు వేయించారు. బురదలోకి దిగి చిన్నారులు స్వయంగా నాట్లు వేస్తూ రైతు కష్టం ఏమిటో అనుభవించారు. ఈ సందర్భంగా నారు పెంపకం నుంచి పొలం దున్నడం, నాట్లు వేయడం, నీటి నిర్వహణ, పంట సంరక్షణ, కోత వరకు వరి సాగులోని ప్రతి దశను సులభంగా అర్థమయ్యేలా వివరించారు. పుస్తకాల్లో చదివే వ్యవసాయ పాఠాలను క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా చూపించడం వల్ల విద్యార్థుల్లో వ్యవసాయం పట్ల ఆసక్తి పెరగడంతో పాటు, అన్నదాత పట్ల గౌరవభావం మరింత బలపడింది. చిన్నారులు ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొని రైతులతో కలిసి పనిచేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు కాపుల విజయ్ మాట్లాడుతూ, "దేశానికి అన్నం పెట్టే రైతు గొప్పతనాన్ని చిన్నప్పటి నుంచే పిల్లలకు తెలియజేయాలి. విద్యతో పాటు జీవిత విలువలు, శ్రమకు గౌరవం, ప్రకృతి పరిరక్షణ, వ్యవసాయం పట్ల అవగాహన పెంపొందించడం కూడా విద్యాసంస్థల బాధ్యత" అని పేర్కొన్నారు. గ్రామస్థులు, రైతులు, తల్లిదండ్రులు ఈ కార్యక్రమాన్ని హర్షిస్తూ, ప్రభుత్వ పాఠశాలల్లో ఇలాంటి అనుభవాత్మక బోధన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని కోరారు. విద్యార్థుల్లో వ్యవసాయం పట్ల చైతన్యం, రైతు పట్ల గౌరవం, ప్రకృతి పట్ల బాధ్యత పెంపొందించే దిశగా ఈ కార్యక్రమం ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు.



# తల్లిపాల వారోత్సవాల్లో ఘనంగా సామూహిక శ్రీమంతాలు



**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి కొత్తపల్లి గోరి**

తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని వెంకటేశ్వర్ల పల్లి గ్రామ పరిధిలో గర్భిణీ మహిళలకు అంగన్వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో సామూహిక శ్రీమంతాల కార్యక్రమాన్ని అత్యంత వేడుకగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ శ్రీమతి సరిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా గర్భిణులకు పండ్లు,పూలు,సాంప్రదాయ సీమంతం కానుకలు అందజేసి,వారిని సర్పంచ్ ప్రత్యేకంగా సత్కరించారు.అనంతరం సర్పంచ్ సరిత మాట్లాడుతూ... "నవజాత శిశువులకు తల్లిపాలు అమృతం లాంటివి.పుట్టిన మొదటి గంటలోనే బిడ్డకు ముర్రిపాలు పట్టించడం వల్ల వ్యాధినిరోధక శక్తి పెరుగుతుంది.చిన్నతనంలో అందించే తల్లిపాలు పిల్లలను భవిష్యత్తులో అనేక అనారోగ్య సమస్యల నుండి కాపాడుతాయి.గర్భిణులు,బాలింతలు సరైన పోషకాహారం తీసుకుంటూ,తమ ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు వహించాలి" అని సూచించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు కవిత,విజయలతో పాటు ఆయా సిబ్బంది,గ్రామ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.అలాగే పాఠశాల ఉపాధ్యాయులు భీమయ్య,జ్యోతి,భీమన్నలతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు,గ్రామానికి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సింగరేణికి పీ.కే ఓసి డీప్ సైడ్ బొగ్గు బ్లాక్ కేటాయింపు

## ఐఎన్టీయూసీ పోరాట ఫలితమే : తీగల క్రాంతి కుమార్"



**సత్తుపల్లి,ఆర్ సి,ఆగస్టు03 (తెలుగుగళం) న్యూస్ :**

మణుగూరు ప్రాంతంలోని పీ.కే ఓసి--2 డీప్ సైడ్ బొగ్గు బ్లాక్‌ను సింగరేణి సంస్థకు కేటాయించడం కార్మికుల ఐక్యతకు, పోరాట స్ఫూర్తికి దక్కిన విజయమని సత్తుపల్లిపట్టణానికి చెందిన ఐఎన్టీయూసీ జాయింట్ జనరల్ కార్యదర్శి తీగల క్రాంతి కుమార్ సోమవారం అన్నారు. తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్, ఐఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి. జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు ఆగస్టు 1న వేలాది మంది కార్మికులతో సింగరేణి వ్యాప్తంగా చేపట్టిన ఉద్యమ ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు.గతంలో తాడిచెర్ల--2 బొగ్గు బ్లాక్‌ను కూడా సింగరేణికే కేటాయించాలని డాక్టర్ బి. జనక్ ప్రసాద్ నేతృత్వంలో కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేయగా, గత నెలలో కేంద్ర ప్రభుత్వం ఆ బ్లాక్‌ను సింగరేణికి కేటాయించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అనంతరం పీ.కే ఓసి డీప్ సైడ్ బొగ్గు బ్లాక్‌ను కూడా సింగరేణికే అప్పగించాలని కోరుతూ, సంస్థకు కలిగే ప్రయోజనాలు, కేటాయించకపోతే ఎదురయ్యే నష్టాలను వివరించడంతో కేంద్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుందని తెలిపారు.ఈ కేటాయింపుతో వేలాది మంది కార్మికుల ఉద్యోగ భద్రత మరింత బలపడటంతో పాటు, స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. మణుగూరు ప్రాంతం మరోసారి పారిశ్రామిక అభివృద్ధికి కేంద్రంగా మారే అవకాశం ఉందన్నారు.తెలంగాణలోని అన్ని బొగ్గు బ్లాక్‌లను సింగరేణి సంస్థకే కేటాయించే వరకు ఐఎన్టీయూసీ ఉద్యమాన్ని కొనసాగిస్తుందని, సింగరేణి సంస్థ బలోపేతం, కార్మికుల హక్కుల పరిరక్షణ, హక్కుల సాధన కోసం యూనియన్ ఎల్లప్పుడూ కార్మికుల పక్షాన నిలుస్తుందని తీగల క్రాంతి కుమార్ స్పష్టం చేశారు.ఈ విజయాన్ని పురస్కరించుకొని జనక్ ప్రసాద్ కు శాలువ కప్పి ఘనంగా సత్కరించారు.

# తల్లి బిడ్డల క్షేమమే ఐసిడిఎస్ లక్ష్యం.

## ఐసిడిఎస్ సిడిపిఓ కమల ప్రియ.



ఖమ్మం/ చింతకాని, ఆగస్టు03 (తెలుగుగళం) న్యూస్: తల్లి బిడ్డల క్షేమమే ఐసిడిఎస్ లక్ష్యం అని, బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించాలని సిడిపిఓ చావా కమల ప్రియ అన్నారు. చింతకాని మండల పరిధిలోని నేరెడ 1 అంగన్వాడీ కేంద్రంలో చింతకాని సెక్టార్ సూపర్వైజర్ సంధ్యారాణి ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలలో కమల ప్రియ మాట్లాడుతూ తల్లిపాలు తాగిన పిల్లల్లో రోగనిరోధక శక్తి అధికంగా ఉంటుందని చురుకుదనంగా ఉంటారని అన్నారు. తల్లిపాలతో సమానమైన పోషక విలువలు కలిగిన ఆహారం మరొకటి లేదు అన్నారు. గర్భిణీగా గుర్తించిన దగ్గర్నుంచి పోషక విలువలు కలిగిన ఆహారం తప్పనిసరిగా తీసుకోవాలని, పోషకాహార లోపం కలిగితే రక్తహీనత సమస్యతో పాటు పుట్టిన బిడ్డకు అవసరమైనన్ని పాలు అందించే అవకాశం ఉండదని, సుఖ ప్రసవం కష్టమవుతుందని అన్నారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేసే విధంగా ర్యాలీలల, గృహ సందర్శనల, సమావేశాల ద్వారా , అవగాహన కార్యక్రమాలు నిర్వహించి తల్లులకు ,కుటుంబ సభ్యులకు చైతన్య పరుస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ వైద్యులు ఎస్.కె సోయర్ మాట్లాడుతూ గర్భిణీలు బాలింతలు చిన్నారులకు అందించే వ్యాధి నిరోధక టీకాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ముత్తయ్య, ఏఎన్ఎం లక్ష్మి, సెక్రెటరీ అర్జున్ ,జిపిఓ వెంకట్, అంగన్వాడి టీచర్ వెంకమ్మ, ఆయా,ఆశ కార్యకర్తలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# భీమవరంలో ముచ్చా ఆత్మీయ పలకరింపు పర్యటన"





**సత్తుపల్లి/వేంసూరు,ఆగస్టు03(తెలుగుగళం) న్యూస్:**

నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలశీలో గల భీమవరం గ్రామంలో సోమవారం రాష్ట్ర ఇరిగేషన్ శాఖ చైర్మన్ ముచ్చా విజయ్ బాబు ఆత్మీయ పలకరింపు పర్యటన చేశారు.దానిలో భాగంగా గ్రామానికి చెందిన తిరుమలశెట్టి రామకృష్ణ,కుమారి దంపతులకు చెందిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిర్మించిన గృహాన్ని సందర్శించి వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఇటీవల మరణించిన తోట వెంకటేశ్వరరావు దశదిన వేడుకలో పాల్గొని చిత్రపటానికి పుష్పాలు వేసి ఘనంగా నివాళులర్పించారు.కుటుంబ సభ్యులను ఓదార్చారు.అంతకన్నా ముందు గ్రామ యూత్ కాంగ్రెస్ నేత ముచ్చా వర్గీయుడు కవిశెట్టి వేణు కాలుకు దెబ్బ తగిలి ఇంటికే పరిమితం అవ్వగా తెలుసుకొని వేణు ను పరామర్శించారు మనో ధైర్యాన్ని కల్పించారు.ఈ కార్యక్రమంలో: గ్రామ సర్పంచ్ వంట్లా రమేష్,ధర్మారావు, కాల్నేని రాజేష్,ముచ్చా అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయిలో ఏటూరునాగారం క్రీడాకారుల సత్తా

# ఏకంగా 18 పతకాలతో ఘన విజయం

## సబ్ జూనియర్, జూనియర్ జావెలిన్ త్రో విభాగాల్లో అద్భుత ప్రతిభ

## రాష్ట్ర స్థాయి పోటీలకు 18 మంది క్రీడాకారుల ఎంపిక

**తెలుగు గళం ఏటూరునాగారం, ములుగు :**




ములుగు జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఏటూరునాగారం క్రీడాకారులు అసాధారణ ప్రతిభ కనబరిచి మొత్తం 18 పతకాలు సాధించి తమ సత్తాను చాటారు. సబ్ జూనియర్, జూనియర్ జావెలిన్ త్రో విభాగాల్లో పోటీ పడిన క్రీడాకారులు అద్భుత ప్రదర్శనతో పతకాలు కైవసం చేసుకుని ఏటూరునాగారం పేరును జిల్లాలో గర్వంగా నిలబెట్టారు. ఈ విజయంతో ఏటూరునాగారం క్రీడా రంగానికి మరోసారి ప్రత్యేక గుర్తింపు లభించింది. గ్రామీణ, గిరిజన ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు కఠోర శ్రమ, క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ఈ ఫలితాలు నిరూపిస్తున్నాయి. ఈ నెల 7, 8 తేదీల్లో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగే తెలంగాణ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఈ విజేతలు అర్హత సాధించినట్లు కోచ్‌లు పర్వతాల కుమారస్వామి మరియు కి. భావన తెలిపారు. రాష్ట్ర స్థాయిలో కూడా ఇదే స్ఫూర్తితో రాణించి మరిన్ని పతకాలు సాధించాలని వారు ఆకాంక్షించారు. క్రీడాకారుల విజయానికి తల్లిదండ్రులు, శిక్షకులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్ర స్థాయిలోనూ ఏటూరునాగారం క్రీడాకారులు సత్తా చాటాలని శుభాకాంక్షలు తెలిపారు.



# కాళేశ్వరం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి కాళేశ్వరం**

వార్షిక తనిఖీల్లో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ (ఎస్పీ) సిరిశెట్టి సంకీర్త్ కాళేశ్వరం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్ పనితీరును,రికార్డుల నిర్వహణను,కేస్ డైరీలను,డిజిటల్ విధానంలో నమోదవుతున్న వివరాలను నిశితంగా పరిశీలించారు. స్టేషన్‌లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిపై సంబంధిత అధికారులతో ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించి,దర్యాప్తు వేగవంతం చేసి బాధితులకు త్వరగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అనంతరం ఎస్పీ మాట్లాడుతూ..





ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ మరింత వేగవంతమైన,పారదర్శకమైన,నిష్పాక్షికమైన సేవలు అందించడమే ప్రతి పోలీస్ అధికారి,సిబ్బంది యొక్క ప్రాథమిక బాధ్యత అని స్పష్టం చేశారు.బాధితులు ఫిర్యాదు చేయడానికి వచ్చినప్పుడు మర్యాదపూర్వకంగా వ్యవహరించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు.నేరాల నియంత్రణకు విధి నిర్వహణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఇదే క్రమంలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్పీ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై తన వంతు బాధ్యతను చాటారు.ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాటారం డి.ఎస్.పి సూర్యనారాయణ,కాళేశ్వరం ఎస్సై తమాషా రెడ్డి,పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అయ్యగారిపేట తల్లి పాల వారోత్సవాలలో ప్రత్యేక ఆకర్షణ"

## తల్లి నుండి బిడ్డకు పాలిచ్చే విధానంపై ప్రాక్టికల్"

## బిడ్డ జన్మించిన గంట లోపే ముర్రుపాలు పట్టించాలి: యు.మహాలక్ష్మి(అయ్యగారిపేట సెక్టార్ సూపర్ వైజర్)



**సత్తుపల్లి,ఆర్ సి,ఆగస్టు03 (తెలుగుగళం) న్యూస్:**

సత్తుపల్లి పట్టణంలోని అయ్యగారిపేట లో గల 3 వ అంగన్వాడీ కేంద్రంలో సోమవారం సెక్టార్ సూపర్ వైజర్ యు.మహాలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు జరిగాయి.బిడ్డకు తల్లి నుండి పాలు పట్టించే విధానంపై ఓ తల్లితో ప్రాక్టికల్ గా పట్టించి చూపించి ఆకర్షణగా నిలిచారు.భారీ ప్రదర్శన చేశారు.ప్రభుత్వ ఆసుపత్రులలో కాన్పులకు గర్భిణీలు రావాలని సుఖ ప్రసవాలు చేయడం జరుగుతుందనీ,పలు వైద్య సూచనలు హెచ్ వి శారారాణి తెలిపారు.పాతపాలు అనారోగ్యాలకు దోహదం చేస్తాయని వద్దని తల్లి పాలు మేలని సూపర్ వైజర్ మహాలక్ష్మి సూచించారు. బిడ్డ జన్మించిన గంట లోపే ముర్రుపాలు పట్టించాలని అలా చేస్తే బిడ్డకు అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయని ఆమె గర్భిణులకు తెలిపారు.అంతే కాకుండా బిడ్డ పుట్టిన రోజు నుండి 06 నెలల వరకు తల్లిపాలు తప్పకుండా పట్టించాలని సూచించారు. అనంతరం చిన్నారుల బరువులు, ఎత్తులు చూసి పౌష్టికాహార లోపాలు లేవని మహాలక్ష్మి నిర్ధారించారు.ఈ కార్యక్రమంలో: అంగన్వాడీ టీచర్స్ కమల, షేక్ రహంతున్నిసా,శ్రీపాటి స్వాతి,ఏఎన్ఎం,ఆశా వర్కర్ సుజాత,చిన్నారులు,లబ్ధిదారులు,గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు.




Printed and Published by BARISHETTI SRIKANTH on be half Of Telugu galam
H.No: H.NO: 8-2-293/82/BJR/127, BJR NAGAR, FILM NAGAR, GREATER HYDERABAD(M.CORP), PO:JUBILEE HILLS, HYDERABAD, TELANGANA - 500033.
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.